ఆది వారం
16-04-2023
సంపుటి - 08,
సంచిక - 297
పేజీలు - 4
వెల రూ. 5/-
Telangana
Andhra Pradesh

CEO & Editor : G. PRUDHVIRAJ

RNI NO: TELTEL/2016/73311

www.samasamajam.in

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

## పేపర్ లీకేజీ కేసులో
# సిట్టింగ్ జడ్జి దర్యాప్తు చెయ్యాలే !

- కాదంటే సిబిఐకి అప్పగించాల్సిందే
- సిట్ దర్యాప్తుతో ఒరిగేదేమీ లేదు
- వరంగల్ మార్చ్‌లో బండి సంజయ్ డిమాండ్
- జిల్లాల్లో కూడా నిరుద్యోగ మార్చ్‌లు నిర్వహిస్తామని ప్రకటన



**వరంగల్,ఏప్రిల్15(సమసమాజం):** పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్ లీకేజీలో సిట్ విచారణతో లాభం లేదని...సిట్టింగ్ జడ్జ్‌తో విచారణ చేయించాలని లేదా సిబిఐ విచారణకు అంగీకరించాలని బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్ డిమాండ్ చేశారు. తప్పు లేకుంటే విచారణకు ఎందుకు వెనకాడుతున్నారని అన్నారు. బీజేపీ వస్తే ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేస్తామని బండి సంజయ్ ప్రకటించారు. వరంగల్‌లో నిర్వహించిన 'నిరుద్యోగ మార్చ్'లో సంజయ్ మాట్లాడుతూ తెలంగాణలో ఏ పరీక్ష నిర్వహించినా తప్పుల తడకేనని విమర్శించారు. నిరుద్యోగులకు సీఎం కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీ కేసులో మంత్రి కేటీఆర్‌ను బర్తరఫ్ చేయాలన్నారు. ఈనెల 21న పాలమూరు గడ్డపై నిరుద్యోగ మార్చ్, అంతేకాకుండా 10 ఉమ్మడి జిల్లాల్లో నిరుద్యోగ మార్చ్, తర్వాత హైదరాబాద్ లో మిలియన్ మార్చ్ జరుపుతామని తెలిపారు. సీఎం కేసీఆర్ పెట్టిన సిట్‌లు ఏ కేసునూ తేల్చలేదన్నారు. అవినీతి, తప్పుల నుంచి

3వ పేజీలో...

# నిజామాబాద్ ఆస్పత్రిలో దారుణం

- రోగిని కాళ్లు పట్టుకుని లెక్కెల్లిన ఘటన
- స్ట్రెచర్ లేకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితి
- సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఘటన
- అదంతా అబద్ధమన్న ఆస్పత్రి సూపర్నెంట్
- ఘటనపై విచారణకు ఆదేశించిన మంత్రి హరీష్ రావు



**నిజామాబాద్,ఏప్రిల్15(సమసమాజం):** నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో అమానుష సంఘటన చోటు చేసుకుంది. అనారోగ్య సమస్యతో నడవలేని స్థితిలో ఓ రోగి ఆసుపత్రికి వచ్చాడు. స్ట్రెచర్ అందుబాటులో లేదని ఆసుపత్రి సిబ్బంది చెప్పడంతో బయట నుంచి రెండో అంతస్థు లిఫ్ట్ వరకు రోగి బంధువులే అతని కాళు పట్టుకుని ఈడ్చుకుంటూ వైద్యుని దగ్గరకు లాక్కెళ్లారు. రోగి కాళ్లు పట్టుకుని లాక్కెళ్తున్నా అక్కడి వైద్య సిబ్బంది కూడా పట్టించుకోలేదు. దీంతో అధికారుల నిర్లక్ష్యం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. గత మార్చి 31న ఈ సంఘటన చోటు చేసుకోగా ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. రోజుకు సగటున 1500 మంది ఓపీలకు వైద్యం అందిస్తుండగా, ఎమర్జెన్సీలో కేవలం 15 స్ట్రెచర్స్ ఉన్నాయని రోగులు చెబుతున్నారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ప్రభుత్వ ఆస్పత్రులలో సరైన సౌకర్యాలు లేక రోగులు ఎలాంటి ఇబ్బందులు పడుతు న్నారో తెలుస్తోందని ప్రతిపక్ష నాయకులు మండిపడుతున్నారు.

3వ పేజీలో...

## అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు
# ఆహ్వానం లేదు

- పిలుపు వచ్చివుంటే వెళ్లేదాన్ని
- గవర్నర్ తమిళి సై కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్,ఏప్రిల్15(సమసమాజం):** ట్యాంక్ బండ్ వద్ద జరిగిన అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణకు తనకు ఆహ్వానం రాలేదని, వచ్చుంటే వెళ్లేదాన్నని గవర్నర్ తమిళి సై కీలక వ్యాఖ్యలు చేశారు. అంబేద్కర్ ఎక్కువగా మహిళల గురించి, మహిళల హక్కుల గురించి మాట్లాడారన్న ఆమె.. కానీ ఒక మహిళా గవర్నర్ కి ఆహ్వానం రాకపోవడం ఆశ్చర్యమని చెప్పారు. అందుకే రాజ్ భవన్ లోనే అంబేద్కర్ కు నివాళులు అర్పించానని ఆమె స్పష్టం చేశారు. తార్నాక

3వ పేజీలో...

# టీఎస్పీఎస్సీ పేపర్ లీక్ కేసు

## ఇడి కస్టడీకి నిందితుల అప్పగింత




**హైదరాబాద్,ఏప్రిల్15(సమసమాజం):** టీఎస్పీఎస్సీ పేపర్ లీక్ కేసులో నిందితులకు నాంపల్లి కోర్టు ఈడీ కస్టడీకి అనుమతి ఇచ్చింది. ప్రధాన నిందితులు ప్రవీణ్, రాజశేఖర్‌ను కస్టడీకి అనుమతి ఇస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. నాంపల్లి కోర్టు 2 రోజులపాటు ఈడీ కస్టడీకి అనుమతించింది. నిందితులను ఈ నెల 17, 18న చంచల్‌గూడ జైలులో ఈడీ అధికారులు ప్రశ్నించనున్నారు. మనీలాండరింగ్ కోణంలో ఈడీ అధికారులు విచారించను న్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ కేసులో మరో ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఈ కేసులో సాయి లౌకిక్, సుష్మితను సిట్ అధికారులు అరెస్ట్ చేశారు. కస్టడీలోని నిందితులు ఇచ్చిన సమాచారం ఆధారంగా అరెస్ట్ చేసినట్లు సమాచారం. సుష్మిత కోసం రూ.6 లక్షలు పెట్టి.. ప్రవీణ్ నుంచి డీఏఓ పరీక్ష పేపర్‌ను సాయి లౌకిక్ కొనుగోలు చేసినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలో 17కు అరెస్ట్?ల సంఖ్య చేరింది. మరోవైపు టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో సిట్ దర్యాప్తును వేగవంతం చేసింది. గ్రూప్-1 ప్రిలిమ్స్ మెరిట్ లిస్టును సేకరించిన సిట్.. 100కు పైగా మార్కులు సాధించిన 121 మందిని విడతల వారీగా విచారించి, వారి స్టేట్‌మెంట్‌ను నమోదు చేసుకుంది. వారి సామర్థ్యం, ప్రతిభాపాటవా లను పరీక్షించేందుకు కొన్ని ప్రశ్నలను వారి ముందు పెట్టి, ఎంత సమయంలో సమా ధానాలు రాస్తారు? అనే విషయాన్ని గుర్తించింది. అదే సమయంలో ఈ కేసులో నిందితులైన ప్రవీణ్, షమీమ్, రమేశ్, సురేశ్‌లతో వీరికి సంబంధాలున్నాయా? అనే కోణంలో దర్యాప్తు చేసింది. అటు జగిత్యాల జిల్లా మల్యాలలో మెయిన్స్‌కు అర్హత సాధించిన 40 మంది అభ్యర్థులను విచారించిన సిట్.. ఓ నివేదికను సిద్ధం చేసింది. ఈ నెల 11న హైకోర్టుకు ఆ రిపోర్టును సీల్డ్‌కవర్‌లో అందజేయనుంది. మరోవైపు ఈ కేసులో 15 మంది

3వ పేజీలో...

# నిజామాబాద్ ఘతన ప్రభుత్వ వైఫల్యమే

- తెలంగాణ మోడల్ ఇదేనా అంటూ రేవంత్ విమర్శలు
- ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట అని మండిపాటు
- ఆరోగ్య తెలంగాణ ఇదేనా అన్న షర్మిల



**హైదరాబాద్,ఏప్రిల్15(సమసమాజం):** నిజామాబాద్ ఆస్పత్రిలో జరిగిన ఘటన ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. ప్రజాప్రభుత్వం పనితీరు ఎలావుందో తెలియచేస్తోందని అన్నారు. ఇదేనా సీఎం కేసీఆర్ చెబుతున్న తెలంగాణ మోడల్ అని ప్రశ్నించారు. నిజామాబాద్ ఆస్పత్రిలో వసతుల లేమీ ప్రభుత్వ వైఫల్యమే కారణమని తప్పుబట్టారు. రోగిని బంధువులు ఈడ్చుకెళ్లడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట కాదా అని నిలదీశారు. బీఆర్ఎస్ సర్కార్ అరాచక పాలన ఫలితమే ఈ ఘటన అని రేవంత్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్ ప్రభుత్వాస్పత్రిలో గత నెల 31న ఓ రోగి చేరాడు. అయితే చికిత్స నిమిత్తం ఆస్పత్రి రెండో అంతస్తుకు వెళ్లాల్సి ఉండగా.. అక్కడ స్ట్రెచర్ లేక రోగిని బంధువులు ఈడ్చుకుంటూ తీసుకెళ్లారు. లిఫ్ట్ వరకు రోగి కాళ్లుపట్టుకుని బంధువులు లాక్కెళ్లారు. ఈ దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇదిలావుంటే

3వ పేజీలో...

# గత ప్రభుత్వాల శాపం జవహర్..డంపింగ్

- శుద్ధి చేసేపనిని పెద్ద ఎత్తున చేపట్టాం
- జవహర్ నగర్‌లో శుద్ధి ప్లాంట్ ప్రారంభించిన కెటిఆర్



**హైదరాబాద్,ఏప్రిల్15(సమసమాజం):** చెత్త కుప్పను గత ప్రభుత్వాలు తమకు వారసత్వంగా ఇచ్చి వెళ్లాయని పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ సమస్య గత ప్రభుత్వాల శాపమని ఆయన అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ జవహర్‌నగర్ డంపింగ్ యార్డు ప్రాంగణంలో లీచెట్ శుద్ధి ప్లాంట్‌ను మంత్రి మల్లారెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. చెత్త నుంచి కరెంట్‌ను ఉత్పత్తి చేస్తున్నామని కేటీఆర్ తెలిపారు. ఈ శుద్ధి ప్లాంట్‌ను రూ. 250 కోట్లతో రాంకీ సంస్థ రెండు ఎంఎల్‌డీల సామర్థ్యంతో నిర్మించింది. కలుషిత వ్యర్థ జలాలను సంపూర్ణంగా శుద్ధి చేసేందుకు ఒక సమగ్రమైన పరిషారాన్ని సిద్ధం చేసిన జీహెచ్ఎంసీ, 2020లో సుమారు రూ.250 కోట్లతో జవహర్‌నగర్ డంప్ యార్డులో వ్యర్థ జలాల ట్రీట్‌మెంట్, మలారం చెరువుతో పాటు కృత్రిమ నీటి గుంటల రిస్టోరేషన్, శుద్ధి కార్యక్రమాన్ని రాంకీ సంస్థ చేపట్టింది. జవహర్‌నగర్ ముఖచిత్రాన్ని సంపూర్ణంగా మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా మరో కీలక మైలురాయిని అధిగమించింది. ఇప్పటికే వ్యర్థాల నిర్వహణలో దేశానికి ఆదర్శంగా నిలుస్తున్న జీహెచ్ఎంసీ, తాజాగా కొన్నేండ్లుగా పేరుకుపోయిన లిక్విడ్ వేస్ట్ (లీచెట్) శుద్ధి చేసే ప్రయత్నాల్లో విజయం సాధించబోతున్నది. ఈ మేరకు జవహర్‌నగర్ డంపింగ్ యార్డు ప్రాంగణంలో కాలుష్య కారక వ్యర్థాల శుద్ధి ప్లాంట్‌ను రూ. 250 కోట్లతో రాంకీ సంస్థ రెండు ఎంఎల్‌డీల సామర్థ్యంతో నిర్మించింది. ఈ ప్లాంట్‌ను పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు, మంత్రి మల్లారెడ్డితో కలిసి శనివారం ప్రారంభించారు. 2017లో ప్రారంభించిన మొబైల్ ఆర్వో సిస్టం ద్వారా రోజుకు 2వేల కిలో లీటర్ల కెపాసిటీతో కలిగిన పాక్షిక ట్రీట్‌మెంట్ పరిషారాన్ని ప్రారంభించింది. ఆ తర్వాత రోజుకు 4వేల కిలోలీటర్లకు పెంచారు. దీంతో పాటు అప్పటికే వ్యర్థ జలాలు నిండిన మలారం చెరువులోని దాదాపు 11.67 లక్షల కిలో లీటర్ల నీటిని శుద్ధి చేసేందుకు ప్రయత్నాలు కొనసాగాయి. అంతేకాకుండా ఈ చెరువులోని వ్యర్థ జలాలు పొంగిపొర్లకుండా సుమారు 4 కోట్ల 35 లక్షలతో స్ట్రామ్ వాటర్ డైవర్షన్ నిర్మాణాన్ని కూడా పూర్తి చేసింది. జవహర్‌నగర్ డంప్ యార్డ్ పైనుంచి వచ్చే వరద నీటి వల్ల జరుగుతున్న కాలుష్యాన్ని పూర్తిగా అరికట్టడం కోసం క్యాపింగ్ పనులు చేపట్టిన జీహెచ్ఎంసీ 2020 నాటికి పూర్తి చేసింది. కలుషిత వ్యర్థ జలాలను సంపూర్ణంగా శుద్ధి చేసేందుకు ఒక సమగ్రమైన పరిషారాన్ని సిద్ధం చేసిన జీహెచ్ఎంసీ, 2020లో సుమారు రూ.250 కోట్లతో జవహర్‌నగర్ డంప్‌యార్డులో వ్యర్థ జలాల ట్రీట్‌మెంట్, మలారం చెరువుతో పాటు కృత్రిమ నీటి గుంటల రిస్టోరేషన్, శుద్ధి కార్యక్రమాన్ని రాంకీ సంస్థ చేపట్టింది. సంవత్సర కాలంగా కొనసాగుతున్న పనుల్లో భాగంగా ఇప్పటికే 43శాతం మేర మలారం చెరువు శుద్ధి పూర్తయింది. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న కాలుష్య నియంత్రణ మండలి లాంటి ఏజెన్సీలు కూడా ఈ అంశాన్ని ధ్రువీకరించాయి. ఇప్పటికే జీహెచ్ఎంసీ మొదటి దశలో భాగంగా 5.7 ఎకరాల మేర ఉన్న చెరువు నీటిని శుద్ధి చేసింది. పేరుకుపోయిన మురికిని శుద్ధి చేసే పనులు కొనసాగుతున్నవి. త్వరలోనే మల్కారం చెరువు జలాలు శుద్ధి కానున్నాయి. పనులు పూర్తయితే జవహర్‌నగర్, పరిసర ప్రాంతాల్లో ఘన వ్యర్థాలతోపాటు, కలుషిత జలాల సమస్య కూడా పూర్తిగా అరికట్టబడుతుంది.


## మహారాష్ట్రలో
# లోయలో పడ్డ బస్సు

### 13 మంది మృతి..25మందికి గాయాలు

**ముంబయి,ఏప్రిల్15(సమసమాజం):** మహారాష్ట్రలోని రాయగడ్ జిల్లాలో శనివారం తెల్లవారుజామున ఘోర ప్రమాదం జరిగింది. ఉదయం 4.30 గంటల సమయంలో పూణెలోని పింపుల్ గురవ్ నుంచి గోరేగావ్‌కు వెళుతున్న బస్సు... రాయ్‌గఢ్ జిల్లాలోని ఓల్డ్ ముంబయి-పుణె హైవే మీదుగా వెళుతూ అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో 13 మంది మృతి చెందారు. 25 మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమయంలో బస్సులో 41 మంది ప్రయాణికులున్నారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయ కార్యక్రమాలు ప్రారంభించారు. పుణె నుంచి ముంబయికు వెళుతున్న ప్రైవేటు బస్సులో ఓ సంగీత బృందం ప్రయాణిస్తోంది. వారంతా ముంబయిలోని గొరెగావ్‌కు చెందినవారు. పుణెకు దగ్గరలోని పింప్రి చించ్వాడ్‌లో ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. తిరిగి వస్తుండగా... తెల్లవారుజామున ఈ ఘోర ప్రమాదం జరిగింది. ముంబై-పుణె పాత హైవేపై ఉన్న శిన్‌గ్రోబా ఆలయం సమీపంలో ఉన్న లోయలో బస్సు పడింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు క్షతగాత్రులను కాపాడే ప్రయత్నం చేశారు. గోరేగావ్‌లోని ఓ సంస్థకు చెందిన వ్యక్తులు అంతా పుణెకు వెళ్లి తిరుగు ప్రయాణం చేస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది.

# మోడీకి వేయి కోట్లు ఇచ్చామంటే కేసు పెడతారా!

- కేజ్రీవాల్‌పైనే అవినీతి ఆరోపణలు చేస్తారా
- మద్యం పాలసీ పేరుతో వేధింపులు
- పేర్లు చెప్పాలని అరెస్టయిన వారిపై ఒత్తిళ్లు
- కేందరం తీరుపై మండిపడ్డ ఆప్ నేత కేజ్రీవాల్
- కేంద్రం తీరును ఎండగట్టిన కపిల్ సిబల్



**న్యూఢిల్లీ,ఏప్రిల్15(సమసమాజం):** అవినీతికి వ్యతిరేకంగా అసెంబ్లీలో మాట్లాడినప్పుడే సీబీఐ సమన్లు పంపుతుందనే విషయం తనకు తెలుసునని ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజీవ్రాల్ శనివారం నాడు అన్నారు. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీపై సీబీఐ సమన్లు పంపిన నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, మద్యం పాలసీ దర్యాప్తునకు సంబంధించి కేంద్ర దర్యాప్తు సంస్థలు కోర్టులో తమపై అబద్ధాలు చెబుతున్నాయని ఆరోపించారు. అరెస్టు చేసిన వ్యక్తులను చిత్రహింసలు పెడుతూ, వారిపై ఒత్తిడి పెంచడం ద్వారా తమను ఇరుకునపెట్టేందుకు చూస్తున్నాయని అన్నారు. మద్యం విధానంలో మనీష్ సిసిడియాపై సీబీఐ తప్పుడు ఆరోపణలు చేసిందని, అబద్ధపు స్టేట్‌మెంట్లు ఇవ్వాలంటూ సాక్షులను చితకబాదుతున్నారని, అవినీతి నిర్మూలించే గొప్ప విధానం ఇదే కావచ్చునని ఆయన విమర్శలు గుప్పించారు. అసలు లిక్కర్ స్కామే లేదని అన్నారు. అందులో వందకోట్ల అవినీతి అన్నది కూడా పచ్చి అబద్ధమన్నారు. అలా అయితే ఒక్క పైసా అయినా ఏదీ అని ప్రశ్నించారు. మోడీకి వేయి కోట్లు ఇచ్చిమని అంటే అరెస్ట్ చేస్తారా అని ప్రశ్నించారు. సీబీఐ తనను ఆదివారంనాడు హాజరుకావాలని పిలిచిందని, తప్పనిసరిగా హాజరవుతానని కేజీవ్రాల్ చెప్పారు. అరవింద్ కేజీవ్రాల్ అవినీతిపరుడైతే ఈ ప్రపంచంలో నిజాయితీపరుడు ఇంకెవరుంటారు? నన్ను అరెస్టు చేయమని బీజేపీ చెబితే, ఆ ఆదేశాలను సీబీఐ తు.చ. తప్పకుండా పాటిస్తుందని కేజీవ్రాల్ అన్నారు. ఢిల్లీ మద్యం కేసులో ఈనెల 16వ తేదీన తమ ముందు హాజరుకావాలంటూ కేజీవ్రాల్‌కు సీబీఐ శుక్రవారంనాడు నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో ఇప్పటికే ఆప్ నేత సిసోడియా, విజయ్ నాయర్ సహా పలువురు జైలులో ఉన్న నేపథ్యంలో కేజీవ్రాల్‌కు సీబీఐ సమన్లు పంపడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఆమ్ ఆద్మీ పార్టీకి ఎన్నికల కమిషన్ జాతీయ హోదా కల్పించిన అనంతరం ఇక పార్టీ నేతలంతా జైలుకు వెళ్లేందుకు సిద్దంగా ఉండాలని కేజీవ్రాల్

3వ పేజీలో...

# సంపాదకీయం

## రాజకీయ ప్రత్యమ్నాయం అసాధ్యమేమీ కాదు!

దేశంలో రాజకీయ శక్తుల పునరేకీకరణకు అవకాశాలు ఉన్నాయి. నితీశ్ కుమార్ తాజాగా చేపట్టిన చర్చలు.. అంతకుముందు నుంచే తెలంగాణ సిఎం కెసిఆర్ చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తే..ప్రత్యామ్నాయం అసాధ్య మేమీ కాదు. అయితే అందుకు చిత్తశుద్ధతో పాటు..నిస్వార్థం కూడా అవసరం. జనతాపార్టీ సందర్భంలో జయప్రకాశ్ నారాయణ్. ఎన్టీఆర్ కూడా ఇలాగే నిస్వార్థంగా పనిచేశారు. ఇప్పుడా పరిస్థితులు మళ్లీ దేశం ముందున్నాయి. గత పదేళ్ల కాంగ్రెస్ నేతృత్వంలోని యూపిఎ పాలనతో విసిగెత్తిన ప్రజలు బిజెపికి పట్టం కడితే...అందుకు భిన్నంగా ఇప్పుడు 9 ఏళ్ల మోడీ పాలన సాగుతోంది. మోడీ పాలనతో ప్రజలు విసుగెత్తి ఉన్నారు. కర్నాటకలో బిజెపి పాలనకన్నా కాంగ్రెసే నయం అన్న భావనలో ప్రజలు ఉన్నారు. గతమే బెటర్ అన్న ధోరణి ప్రజల్లో బలంగా నాటుకుంది. అలాగని గతంలో కాంగ్రెస్ మంచి చేసిందన్న భావన కాదు. రైతుల ఆందోళనలు, లఖింపూర్ ఘటనలు, పెట్రో, గ్యాస్ ధరలు, నిత్యావసర ధరల పెరుగుదల గమనిస్తే ఈ భావన కలుగుతోంది. అంతేగాకుండా ప్రజలకు అందుబాటులో లేని ప్రభుత్వంగా మోడీ పేరు తెచ్చుకు న్నారు. ఆయన సామాన్యులకు అందుబాటులో ఉండడం లేదు. మంత్రులకు అధికారం లేదు. బిజెపి తను చేసిన ఘనకార్యాలను చాటే బదులు ఇంకా కాంగ్రెస్‌ను విమర్శిస్తూ కుటిల రాజకీయాలను వంటబట్టిం చుకుంది. దీంతో నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా దాదాపుగా అన్ని పార్టీలూ ఏకం అవుతున్నాయి. కాంగ్రెస్, నితీశ్ కుమార్‌లో రంగంలోకి దిగారు. తెలంగాణలో కెసిఆర్ కూడా జాతీయ రాజకీయాల్లో పావులు కదుపుతున్నారు. అన్ని పార్టీలు ఏకమైతే మోడీని దించడం పెద్ద కష్టమేమీ కాకవపోవచ్చు. అయితే ఈ పార్టీల్లో ఐక్యతే ఎండమావిగామారింది. అధికారంతో కూడిన అహంకారం తలకెక్కిన బిజెపి నేతలు.. అవినీతికి దూరంగా ఏమీ లేరు. కానీ ఎదుటివారి అవినీతినే వారు బూచిగా చూపిస్తున్నారు. వారికి వాస్తవాలు కనిపించవనడానికి దేశ సమస్యల పరిష్కారంలో వైఫల్యాలను కప్పిపుచ్చు కోవడమే నిదర్శనం. ఎపికి ప్రత్యేక హోదా హామీని అమలుచేయలేక పోవడంతో ఎపిలో ప్రజలు బిజెపి అంటేనే మండిపడుతున్నారు. ప్యాకేజీ అమలు కాకపోవడంతో పరిస్థితులు తిరగబడ్డాయి. ప్రత్యేక హోదా అంశం మళ్లీ తెర మీదకు వచ్చింది. ప్రజాభిప్రాయానికి అనుగుణంగా నడుచుకోని పార్టీలకు మనుగడ ఉండదని బిజెపి నేతలు భావించడం లేదు. తమకు భారతీయ జనతా పార్టీ అన్యాయం చేస్తున్నదని ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రజలు బలంగా నమ్ముతున్నారు. దీనికంతటికీ కారణం నరేంద్ర మోదీ పాలనాతీరే నిదర్శనంగా చూడాలి. దేశంలో పరిస్థితులు నానాటికి దిగజారుతున్నాయి. ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. రాహుల్‌పై సత్వర చర్యలతో ప్రజల్లోనూ ఆలోచన పెరిగింది. దీంతో కాంగ్రెస్‌లో ఉత్సాహం రెట్టింపయ్యింది. సమస్యలపై పోరాటంలో ప్రాంతీయ పార్టీల నాయకులే కాకుండా కాంగ్రెస్ పార్టీ కూడా చేయి కలిపింది. చెల్లాచెదురుగా ఉన్న ప్రతిపక్షాలను ఏకం కావడం అన్నది మోడీ పట్ల ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను ప్రచారం చేయడానికి పనికివస్తోంది. మోడీ ప్రభుత్వం పట్ల ప్రస్తుతం దేశమంతా అసంతప్తి, ఆగ్రహం వ్యక్తం చేస్తోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శలు చేస్తున్నారు.ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా ఇవ్వాల్సిందే నని, దానితో పాటు విభజన సమయం లో ఇచ్చిన హామీలు అన్నీ అమలు చేయాలని ఇప్పటికీ అన్ని పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతూ బిజెపి దేశాన్ని అడ్డగోలుగా చీల్చేస్తోందని రాహుల్ ధ్వజమెత్తారు. ప్రస్తుతం దేశమంతా అసంతప్తి, ఆగ్రహంతో ఉంది. ఈ పరిస్థితుల్లో దేశం మొత్తాన్ని ఏకం చేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని రాహుల్ ప్రయత్నాలు చేస్తున్నారు. అన్ని వర్గాల ప్రజల అభివద్ధి, ప్రయోజనాల కోసమే కాంగ్రెస్ పనిచేస్తోందని హామీ ఇచ్చారు. మన్మోహన్ సింగ్ ప్రభుత్వ హయాంలో ఆర్థికవృద్ధి తిరోగమనంలో పడిందని ఎన్నికలకు ముందు మోడీ విపరీతంగా ప్రచారం చేశారు. అయితే మోడీ పాలన అంతా ప్రచార ఆర్భాటంగా ఉందని తాజా పరిస్థితులు అద్దం పడుతున్నాయి. అందుకే వ్యవసాయం, యువత, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, నిరుద్యోగం, పేదరిక నిర్మూలన, దేశ భద్రత, ఆర్థిక, పారిశ్రామిక విధానం, విదేశీ వ్యవహారాలు, కుంభ కోణాలు, అవినీతిపై ప్రజల్లో విపరీతమైన చర్చ జరుగుతోంది. గత పదేళ్ల కాంగ్రెస్ పాపాలను ప్రజలు మరచిపోయారు. ఎందుకంటే బిజెపి పాలన ప్రజలకు భారంగా మారింది. నోట్ల రద్దు, జిఎస్టీ,పెట్రోధరలు, గ్యాస్ ధరలు తదితర అంశాల కారణంగా ప్రజలపై కోలుకోలేని ఆర్థిక భారం పడుతోంది. ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. రైతులకు గిట్టుబాటు ధరలు రావడం లేదు. దేశంలో నిరుద్యోగం తాండవిస్తోంది. దీంతో పాటు అనేక సమస్యలు ప్రజలను వెన్నాడుతున్నాయి. ఈ దశలో ప్రజలకు మళ్లీ తృతీయప్రత్యామ్నాయం ఆశగా కనిపిస్తోంది. సిఎం కెసిఆర్ కూడా కేంద్రం తీరును ఇటీవల గట్టిగానే తూర్పారా బట్టారు. దేశంలో అన్ని ప్రాంతాల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్న దృష్ట్యా పరిస్థితులు బిజెపికి వ్యతిరేకంగా మారుతున్నాయి. ఈ క్రమంలో విపక్షాలు ఉమ్మడి కార్యాచరణతో ముందుకు రావాలి. ఎన్నికల తరవాతే పొత్తు అంటున్న సిపిఎంపిడివాదాన్ని వీడాలి. పొత్తులకన్నా ముందు దేశ ప్రజలకు విశ్వాసం కల్పించే రాజకీయ పార్టీ కావాలి. ఉమ్మడి ఎజెండాతో ప్రజలకు ముందుకు వెళ్లగలికే కూటమి కావాలి. విపక్షాలు కలసిన ప్రతిసారీ ప్రధాని ఎవరన్నా ఆలోచన సరికాదు. ప్రత్యామ్నాయం ఎలా అన్నద సంకల్పంతో సాగాలి.

# ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర

- బడ్జెట్‌లో పథకానికి 30వేల కోట్ల కోత
- కేంద్రానికి పోస్ట్ కార్డు రాసిన మంత్రి హరీష్ రావు




**హైదరాబాద్,ఏప్రిల్15(సమసమాజం):** ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయాలని కేంద్రం చూస్తోందని రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీష్ రావు ఆరోపించారు. గత ఏడాది బడ్జెట్‌లో ఈ పథకానికి 30 వేల కోట్ల కోత విధించారని చెప్పారు. దాంతో ఉపాధి హామీ కూలీలకు పని దినాలు తగ్గాయన్నారు.వ్యవసాయ కూలీకి రోజుకు 257 రూపాయలు ఇవ్వాలని చట్టంలో ఉన్నప్పటికీ, ఒక్కో కూలికి వంద రూపాయలకు మించడం లేదని మంత్రి విమర్శించారు. పని ప్రదేశాల్లో కనీస మౌలిక సదుపాయాలు ఉండటంలేదని, టెంటు, మంచి నీళ్లు, గడ్డపారలు, పారలు, తట్టలు వంటివి అందించడం లేదని చెప్పారు. ఉపాధి హామీ పథకంపై నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి చేపట్టిన పోస్టు కార్డుల ఉద్యమంలో భాగంగా హైదరాబాద్‌లో మంత్రి హరీష్ రావు కేంద్రానికి పోస్టుకార్డు రాశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి సమక్షంలో పోస్టు కార్డు రాసిన అనంతరం మంత్రి మాట్లాడుతూ.. కనీస వేతన చట్టం ప్రకారం 8 గంటలు పనిచేసిన కూలీకి 480 రూపాయలు ఇవ్వాలని ఉన్నప్పటికీ, ఉపాధి హామీ కూలీలకు మాత్రం కనీస కూలీ గిట్టడం లేదని వాపోయారు. ఆన్‌లైన్ పద్ధతివల్ల గ్రామీణ అటవీ ప్రాంతాల్లోని ప్రజలకు నష్టం జరుగుతున్న దన్నారు. వారికి సెల్‌ఫోన్ సిగ్నల్స్ లేక ఉదయం 10 గంటలకు, సాయంత్రం 4 గంటలకు కంప్యూటర్‌లో అప్‌లోడ్ చేయాలనే నిబంధనలు పాటించలేకపోతున్నారని చెప్పారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయానికి ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేశారని, సన్న, చిన్నకారు రైతులు ఎక్కువగా ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో కూలీలుగా వారే ఉంటున్నారని, కాబట్టి వ్యవసాయాన్ని ఉపాధి హామీ పథకానికి అనుసంధానం చేయటంవల్ల రైతులకు కూలీ గిట్టుబాటు అవుతుందని మంత్రి పోస్టు కార్డులో పేర్కొన్నారు. ప్రతి ఎకరాకు నిర్ణీత టోకెన్లు, కనీసం 100 పని దినాలు కల్పించాలని, అలాగే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్‌ల నుంచి ఏపీవోల వరకు ఉపాధి ఉద్యోగులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని రాశారు. మంత్రి ఎర్రబెల్లి చేతుల మీదుగా ఈ నెల 8న నర్సంపేట నియోజకవర్గం దుగ్గొండి మండలం మహమ్మదాపురంలో ఈ పోస్టు కార్డుల ఉద్యమం ప్రారంభమైంది.

# దమ్ముంటే ఢిల్లీలో ధర్నా చేయండి

### 2కోట్ల ఉద్యోగాల పై నిలదీయండి

### బిజెపి నిరుద్యోగ మార్చ్‌పై మండిపడ్డ తలసాని




**హైదరాబాద్,ఏప్రిల్15(సమసమాజం):** ఏడాదికి రెండుకోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోసం చేసిన కేంద్రంలోని ప్రభుత్వాన్ని బిజెపి నేతలు ముందుగా నిలదీయాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. మాటతప్పిన మోడీని ఎందుకు నిలదీయరో చెప్పాలన్నారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలో జరిగిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బీజేపీ నాయకులు ఇచ్చిన మాటను నిలబెట్టుకోకుండా రాష్ట్రంలోని నిరుద్యోగులతో మిలీనియం మార్చ్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. అందులో కేంద్రం ఉద్యోగాల హామీని నిరుద్యోగులు ప్రశ్నించాల న్నారు. బీజేపీ నాయకులకు దమ్ముంటే ఢిల్లీలో మిలీనియం మార్చ్ చేయాలని సవాలు విసిరారు. ఉద్యోగాలు ఇస్తామన్న కేంద్రంలోని బీజేపి ప్రభుత్వం 9 సంవత్సరాలలో ఎన్ని భర్తీ చేసిందని ప్రశ్నించారు. వెంటనే దీనిపై వివరాలు తెలపాలన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ప్రభుత్వం 1.35 లక్షల ఉద్యోగాలు భర్తీ చేసిందని,90 వేల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. గత ప్రభుత్వాలు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరును ఉపయోగించుకొన్నాయే తప్ప సరైన గౌరవం ఇవ్వలేదని ఆరోపించారు.ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రమే దేశంలోనే అతిపెద్ద 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసి నిజమైన గౌరవం కల్పించారని వెల్లడించారు.కేంద్రం నుంచి తీసుకొచ్చి అభివృద్ధి చేయడం చేతకాని బీజేపీ నేతలు ప్రభుత్వం పై విమర్శలు చేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు.కేంద్రమంత్రి గా ఉన్న కిషన్ రెడ్డి నాలుగు సంవ త్సరాలలో ఎన్ని నిధులు తెచ్చారని, ప్రజలకు ఏం చేశారో చెప్పగలరా అని ప్రశ్నించారు.

# నిజామాబాద్ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు

### కావాలనే షూట్ చేసి..15 రోజుల తరవాత పోస్ట్

### ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ వెల్లడి

**నిజామాబాద్,ఏప్రిల్15(సమసమాజం):** నిజామాబాద్ ప్రభుత్వాసుపత్రిలో రోగిని కాళ్లు పట్టుకుని లాక్కెళ్లిన ఘటన అంతా కావాలని చేసిందేనని ఈ ఘటనపై పై ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ స్పందించారు. కావాలనే 15 రోజుల తర్వాత వీడియో సోషల్ మీడియాలో వైరల్ చేశారని ఆరోపించారు. పేషేంట్ ను ఆసుపత్రి సిబ్బంది జాగ్రత్తగా వీల్ చైర్ లో తీసుకెళ్లాక.. ఈ వీడియో షూట్ చేశారని చెప్పారు. మీడియా మిత్రులు సహనం పాటించాలని, నిజాలను మాత్రమే ప్రసారం చేయాలని ఈ సందర్భంగా సూపరింటెండెంట్ విజ్ఞప్తి చేశారు. హన్మండ్లు.. అనే పేషేంట్ గా ప్రాథమికంగా గుర్తించామన్న ఆమె.. ఈ వార్తను ఖండిస్తున్నామని, ఈ ఘటనపై, ఈ వీడియో షూట్ చేసిన వ్యక్తిపై పోలీసులకు పిర్యాధు చేశామని స్పష్టం చేశారు.అసలేమైందన్న విషయాన్ని చెప్పే ప్రయత్నం చేసిన ఆమె.. గత నెల 31న పేషేంట్ ఆసుపత్రికి వచ్చారని, ఆ సమయంలో పేషేంట్ మద్యం మత్తులో ఉన్నాడని చెప్పారు. తాము వెంటనే స్పందించి వైద్యం కోసం రెఫర్ చేశామన్నారు. క్యాజువాలిటీ నుంచి లిఫ్ట్ వరకు ఆసుపత్రి సిబ్బంది వీల్ చైర్ లో తీసుకెళ్లారన్న సూపసూపరింటెండెంట్.. వైరల్ అయిన వీడియోలో ఆసుపత్రి సిబ్బంది లేరని చెప్పారు. పేషేంట్ ను లాక్కెళ్లిన వీడియో 10 సెకన్లు మాత్రమే ఉందని, అది కూడా కావాలనే రికార్డ్ చేశారని ఆరోపించారు. అసుపత్రిలో కావాలసినన్ని వీల్ ఛైర్స్, స్ట్రెచ్చర్స్ ఉన్నాయని ప్రతిమారాజ్ చెప్పారు. ఓ అజ్ఞాత వ్యక్తి ఈ వీడియోను కావాలనే తీశారని, అతన్ని పట్టుకునేందుకు తమ సిబ్బంది ప్రయత్నించినా, అతను దొరకలేదని చెప్పారు. సిబ్బంది మనోభావాలను దెబ్బతీయాలని ఇలా చేశారని ప్రతిమారాజ్ చెప్పారు. రాష్ట్రంలో అత్యధిక సక్సెస్ రేట్ తో వైద్యం చేస్తున్న ఆసుపత్రి ఇది అని, మెరుగైన వైద్యం ఇస్తోన్న నిజామాబాద్ ఆసుపత్రిపై దుష్ప్రచారం చేయటం కరెక్ట్ కాదని ప్రతిమారాజ్ తెలిపారు. ఈ ఘటనపై విచారణ చేయిస్తామన్న ఆమె.. నిందితులపై చర్యలకు పిర్యాధు చేస్తామని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# స్వచ్ఛ అవార్డులు గుజరాత్‌కు ఎందుకు రావట్లేదు

### మోడీని ప్రశ్నించిన మంత్రి ఎర్రబెల్లి




**హైదరాబాద్,ఏప్రిల్15(సమసమాజం):** స్వచ్ఛ గ్రామీణ అవార్డులు తెలంగాణకు వచ్చినంతగా గుజరాత్‌కు ఎందుకు రావడం లేదని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రధాని నరేంద్రమోదీ, కేంద్రమంత్రి అమిత్ షాలను ప్రశ్నించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ముందు చూపు వల్ల తెలంగాణ గ్రామాలు సంపూర్ణ అభివృద్ధిని సాధిస్తున్నాయని పేర్కొన్నారు. ఇటీవల జాతీయ అవార్డులు పొందిన తెలంగాణ గ్రామాలు, మండలాలు, జిల్లా పరిషత్‌ల ప్రజా ప్రతినిధులు, అధికారులు ఈ నెల 17న ఢిల్లీ లో రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డులు అందుకోవడానికి వెళుతున్నారు. ఈ సందర్భంగా వారికి, హైదారాబాద్ లోని మంత్రుల నివాసంలో అల్పాహార విందు ఇచ్చి వీడ్కోలు పలికారు. ఆయన మాట్లాడుతూ సీఎం ప్రత్యేక చొరవతో గ్రామాల రూపురేఖలు మారిపోయాయని పేర్కొన్నారు. ' గ్రామాల్లో అన్ని సదుపాయాలు పెరిగాయి. ట్రాక్టర్లు, ట్రాలీలు, ట్యాంకర్లు వస్తాయని కూడా ఎవరూ ఊహించలేద' ని వెల్లడించారు. ఇప్పటివరకు గత మూడేళ్లలో రాష్ట్రానికి 79 అవార్డులు వచ్చాయని, ఇంకా వస్తాయని ధీమాను వ్యక్తం చేశారు. కేంద్రం సహకరిస్తే, ఇంకా అభివృద్ధికి అవకాశం ఉండేదని అభిప్రాయపడ్డారు. ఇప్పటికైనా సీఎం కేసీఆర్ చెప్పినట్లు, అసెంబ్లీ తీర్మానం చేసిన విధంగా ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తే బాగుంటుందని కేంద్రానికి సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్, ములుగు జిల్లా చైర్మన్ కుసుమ జగదీశ్, కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, కమిషనర్ హనుమంతరావు, ప్రత్యేక కమిషనర్లు ప్రసాద్, ప్రదీప్ శెట్టి , అవార్డులు పొందిన సర్పంచులు, కార్యదర్శులు, ఎంపీపీలు, డీపీవోలు తదితరులు పాల్గొన్నారు.

# టీఎస్పీఎస్సీ పేపర్ లీక్ కేసు

(మొదటి పేజీ తరువాయి) అరెస్టయిన వారిలో చివరి ముగ్గురు నిందితులు ప్రశాంత్, తిరుపతయ్య, రాజేంద్రకుమార్‌ల పోలీసు కస్టడీ గురువారంతో ముగియడంతో, వారిని చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఈ ముగ్గురూ ఎంత మందికి ఏఈ ప్రశ్నపత్రాన్ని విక్రయించారు? అనే కోణంపై ఈ మూడ్రోజులూ ప్రశ్నించి, వాంగ్మూలాన్ని సేకరించినట్లు తెలిసింది.

### మునుగోడు నియోజకవర్గ ప్రజలారా .. మోసపోతే గోస పడుతాం

# కాంట్రాక్టర్లతో జాగ్రత్త !

- సచ్చినోనికి 10 వేలు, బతికినోనికి 5 వేలు
- పాత లీడర్ పెట్టలేదని, కొత్త లీడర్ వైపు మొగ్గు
- కేవలం 7 నెలలకే ఓ వర్గం మద్ధతు
- డబ్బును నమ్ముకున్న రాజగోపాల్‌రెడ్డి దారిలో చల్లమల్ల
- ఉద్యమకారులకు, ఉన్నత చదువులు చదివిన మేధావులకు రాజ్యాధికారాన్ని దూరంచేస్తున్న పెట్టుబడిదారులు

**ఎన్నికలు సమీపిస్తున్న వేళ** డబ్బుల సంచులతో చల్లమల్ల రడీ ?

- ఎన్నికలు సమీపిస్తున్న వేళ 6 నెలలకు గాను రోజువారిగా ఒక్కో కుటుంబానికి 10,000ల చొప్పన 30 కుటుంబాలకు 3,00,000 లక్షల రూపాయలను పంచి సానుభూతి ఓట్లు పొందేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఎన్ని లక్షలు పెట్టి ప్రచారం చేసుకున్నా జరగని ప్రచారం చనిపోయిన శవం దగ్గర తీసే ఫోటో సాక్షిగా భారీ పబ్లిసిటీతోపాటు, ఆ ఫోటోను పేపర్లలో, సోషల్‌మీడియాలో పెట్టుకొని జేజేలు కొట్టించుకునే స్థాయికి చేరుకుంటున్నారు. ఆ కోవకు చెందిన నేతల్లో అప్పట్లో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఉండే. కాని ప్రస్తుతం చల్లమల్ల కృష్ణారెడ్డి ముందంజలో ఉన్నారు.
- ఎన్నికల సమయంలో ప్రజలు సంపన్నుల వైపు మొగ్గు చూపుతున్నారు. సామాన్యులు, మేధావులు, ఉన్నత చదువులు చదివిన వారు ఎన్నికలలో పోటీకి నిలబడాలంటే వెనుకడుగు వేసే పరిస్థితి వచ్చింది. ఇందుకు కారణం బడాబాబులు, కాంట్రాక్టర్‌లు ఓట్లను డబ్బులతో ప్రజల నుంచి విక్రయించుకుంటున్నారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుక బడిన ప్రజలు ఆశించే స్థాయి నుంచి శాసించే స్థాయికి రావాలని ఓటు హక్కును ప్రసాదించింది రాజ్యాంగం. ఓటు విలువ తెలియని ప్రజలు ఓటును అంగట్లో సరుకు లెక్క ఎన్నికల సమయంలో అమ్ముకుంటున్నారు. ఓటును కొనేవాడు దురుద్యేశ్యంతో అధికారాన్ని శాసించడానికి చేసే ప్రయత్నంలో భాగంగా డబ్బులు పంచుతున్నాడు. అంతకంటే ముందు చావు, బతుకులకు డబ్బులు ఇచ్చి సానుభూతి ఓట్లు పొందుతున్నారు. సరే చావులప్పుడు ఆదుకుంటే పర్వాలేదు కాని అదే ఫోటోను ఓట్ల కోసం వాడుకుంటూ, ప్రచారం కోసం వాడుకుంటే అంతకంటే దుర్మార్గం మరోటి ఉంటుందా !.



మునుగోడుకు భారీ కాన్వాయితో చల్లమల్ల కృష్ణారెడ్డి హల్‌చల్



**హైదరాబాద్,ఏప్రిల్15(సమసమాజం):** ఎమ్మెల్యే అభ్యర్థి డబ్బులు పంచాల్సిందేనా!, ఖరీదైన కార్లల్లో భారీ కాన్వాయితో పర్యటనలు చేసే వారే ఎమ్మెల్యేగా పోటీ చేయాలా!. అలాంటి వారికే ప్రజలలో ఆదరణ ఉంటుందా! ఎన్నికల సమయంలో ప్రజలకు నేతలు పలు రకాలుగా ప్రలోభపెట్టడం చూస్తున్నాం. ఆ క్రమంలో డబ్బు న్నవాడు వ్యవస్థను దుర్వినియోగం చేస్తు న్నాడనే ఆందోళన కలుగుతుంది. బడా కాంట్రాక్టర్ల ముడుపులకు తాత్కాలిక ఉపశ మనం కోసం ప్రజలు మద్ధతు తెలుపుతు న్నారు. బడుగు జీవుల పక్షాన బడుగు జీవు లే పాలకులుగా ఎదిగే అవకాశం లేకుండా పోయింది. కాంట్రాక్టుల రూపంలో, రియల్ ఎస్టేట్ రూపంలో కోట్ల రూపాయలను అప్పనంగా సంపాదించిన అక్రమ సొమ్మును ఎన్నికలలో పంచి రాజ్యాధికారం పొందాలని చూసే దుర్మార్గులు ఈ రోజుల్లో ఎక్కువైయ్యారు. ఈ తంతు ప్రజా స్వామ్యానికి శ్రేయస్కరం కాదు అని సామాజిక వేత్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రాజకీయాలలో కూడా షార్ట్‌కట్ వెతుకుతున్న ఈ రోజుల్లో కొందరు నేతలు ఏదో ఒక ప్రధాన పార్టీ నుంచి టికెట్‌ను ఆశించి నియోజకవర్గాల వైపుదారులు వేసుకుంటున్నారు. ఈ నేపద్య ంలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మునుగోడు నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ తరఫున టికెట్ రాకున్నా డబ్బు సంచులతో రెబల్‌గా పోటీలో నిలబడేందుకు ఆసక్తి చూపుతు న్నట్లుగా పొలిటికల్ సర్కిల్‌లో పుకార్లు చెక్కర్లు కొడుతుంది.

రేపటి సంచికలో కొనసాగింపు

# రాజ్యాంగాన్ని తిరగరాస్తామన్న కెసిఆర్ దురహంకారి

### అంబేడ్కర్ విగ్రహాన్ని పెడితే దళితజనోద్ధరణ జరిగినట్లా

### మండిపడ్డ కాంగ్రెస్ నేత మల్లు రవి విమర్శలు




**హైదరాబాద్,ఏప్రిల్15(సమసమాజం):** అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణకు తాము వ్యతిరేకం కాదని.. కానీ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని తిరిగి రాస్తా అన్న కెసిఆర్ వ్యాఖ్యలను వ్యతిరేకిస్తున్నామని కాంగ్రెస్ సీనియర్ నేత మల్లు రవి అన్నారు. రాజ్యాంగాన్ని తిరగరాయాలన్న వ్యక్తికి అంబేద్కర్ గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. శనివారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ రిజర్వేషన్‌లు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీనే అసలైన దళితబంధు అని అన్నారు. సబ్ ప్లాన్ నిధులు ఖర్చు పెట్టని బీఆర్ఎస్ ఎలా దళితబంధు అవుతుందని ప్రశ్నించారు. సబ్ ప్లాన్ నిధులపై వైట్ పేపర్ రిలీజ్ చేస్తే సీఎం కేసీఆర్ బంధువో.. రాబందువో తెలుస్తోందన్నారు. అంబేద్కర్ పెద్ద విగ్రహం పెట్టినంత మాత్రాన సీఎం కేసీఆర్ దళితబంధు కాలేరని.. కెసిఆర్ ఏమైనా సొంత డబ్బుతో విగ్రహం పెట్టారా అని నిలదీశారు. ప్రైవేట్ యూనివర్సిటీలు తెచ్చి ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ లేకుండా చేసిన ముఖ్యమంత్రి.. దళిత వ్యతిరేకులని మల్లు రవి విమర్శించారు. రాజ్యాంగాన్ని చంపి, అంబేద్కర్ విగ్రహం పెట్టామంటే ఎవరూ హర్షించరన్నారు. ప్రకాష్ ఒక్కరే అంబేద్కర్ వారసులు కారని, తామంతా అంబేద్కర్ వారసులమేనని అన్నారు. సీఎం కేసీఆర్ దళితులకు ఏం గొప్ప పని చేశారో ప్రకాష్ అంబేద్కర్ చెప్పాలని.. కేసీఆర్‌ను ప్రశంసించడం అంటే దళిత గిరిజనులకు అవమానిం చడమేనని మల్లు రవి వ్యాఖ్యానించారు.

# దేశంలోనే లేని అభివృద్ధి పనులు కేసీఆర్‌తో సాధ్యం

తెలంగాణలో మళ్లీ బిఆర్ఎస్‌కే ప్రజలు పట్టం కడతారు: ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి



**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 16 (సమ సమాజం):** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం యాచారం మండలంలోని సాయి శరణం గార్డెన్స్ లో మండల బిఆర్ఎస్ పార్టీ సమ్మేళనం కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న రంగారెడ్డి జిల్లా సమ్మేళనాల ఇంచార్జ్, ఎమ్మెల్సీ ఎల్.రమణ , బిఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు,ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి , రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్ , యువనేత మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.ముందుగా యాచారం మండల కేంద్రంలో బిఆర్ఎస్ కార్యకర్తల భారి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, యాచారం మండలంలో అనేక ఫార్మా కంపెనీలలో ఉద్యోగాలు చేసుకునే అవకాశంలో ముందుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే ఏ రాష్ట్రంలో చేయలేని అభివృద్ధి పనులను చేసిందని, తెలంగాణ ప్రజలందరూ రాబోయే ఎన్నికలలో టిఆర్ఎస్ పార్టీకే పట్టం కడతారని ఆ విధంగా తెలంగాణ రాష్ట్రం పని చేసిందని ఆ ఘనత సీఎం కేసీఆర్ కే దక్కుతుందని అన్నారు. భారత దేశంలోనే ఎక్కడా లేని అంబేద్కర్ విగ్రహం మన తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్ నాయకత్వంలో ఏర్పాటు చేయడం తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ కెసిఆర్ ను గుండెల్లో పెట్టుకొని చూస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ కమిటీ చైర్మన్ సత్తు వెంకట రమణారెడ్డి, జడ్పిటిసి చిన్నోళ్ల జంగమ్మ, యాచారం మండల అధ్యక్షులు కర్నాటి రమేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి పాచ్చ భాష, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ ఏర్పుల చంద్రయ్య, వైస్ చైర్మన్ రవీందర్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ఆడాల గణేష్, పిఎసిఎస్ చైర్మన్ రాజేందర్ రెడ్డి, పిఎసిఎస్ డైరెక్టర్లు మక్కపల్లి స్వరూప, మేడిపల్లి సర్పంచ్ చిగురింత శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ ఆలంపల్లి సత్తమ్మ, ఎంపీటీసీ మొరుగు శివలీల,నందివనపర్తి సర్పంచ్ ఉదయశ్రీ, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, వివిధ గ్రామాల అధ్యక్ష కార్యదర్శులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సౌర విద్యుత్ ప్రయోగాలు పెంచాలి !

## విస్తృత ప్రయోగాలకు ప్రోత్సాహం దక్కాలి • ఐఐటి వంటి సంస్థల్లో పరిశోధనలు సాగాలి

**న్యూఢిల్లీ,ఏప్రిల్15(సమ సమాజం):** దేశంలో నేటికీ నిరంతర విద్యుత్ అన్నది కలగానే ఉంటోంది. ఉన్న విద్యుత్ ప్రజలకు ఖరీదైన వస్తువుగా మారింది. ఈ క్రమంలో సౌర విద్యుత్ ఉత్పత్తి, అధ్యయనం జరగాలి. సౌర విద్యుత్‌ను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేసే సులైవన వ్యయస్థలపై పరిశోధనలు సాగాలి. రెండేళ్ల క్రితం బొగ్గు సంక్షోభం కారణంగా విద్యుత్ ఉత్పత్తికి ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో అనేక రాష్ట్రాల్లో తీవ్ర గందరగోళం ఏర్పడింది. తరవాత పరిస్థితి సాధారణ స్థితికి చేరుకునా...నేటికీ నిరంతర విద్యుత్ అన్నది లేదు. ఎపిలో కూడా విద్యుత్ కష్టాలు ముందు నుంచీ ఉన్నాయి. అయితే తెలంగాణ మినహా దేశంలో ఎక్కడా నిరంతర విద్యుత్ సరఫరాకు భరోసా ఉన్న పరిస్థితి కానరావడం లేదు. తెలంగాణలో మాత్రమే నిరంతర విద్యుత్‌తో ప్రజల్లో భరోసా ఉంది. కరెంట్ కోతలు అన్న పదం లేకుండా విద్యుత్ అందుతోంది. మన నిత్య జీవితంలో అతి ముఖ్యమైన వనరు విద్యతు అన్నది గుర్తించాలి. ఇది లేకుంటే ఏరంగం కూడా ముందుకు సాగదు. అభివృద్ధికి అతిపెద్ద వనరుగా ఉన్న విద్యుత్‌పై భవిష్యత్ ప్రణాళికలు అవసరం. విద్యుత్ రంగాన్ని కేంద్రం తన ఆధీనంలోకి తీసుకోవాలని చూస్తున్న వేళ ఇలాంటి సంక్షోభానికి కారణాలను కేంద్రం అద్యయనం చేయాలి. ధర్మల్ పవర్ స్టేషన్లలో బొగ్గు నిల్వలు నిరంతర సమస్యగా మారింది. తాజాగా ఆదానీ ఆధీనంలో బొగ్గు గనులు ఉన్నాయని, వాటినే కొనుగోలు చేయాలని మోడీ ప్రభుత్వం ఒత్తిడి చేస్తోందని ఇప్పటికీ తెలంగాణ ప్రభుత్వం ఆరోపిస్తోంది. గతంలో సంక్షోభం కారణంగా మహారాష్ట్రలోని 13 బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు తాత్కాలికం గా మూతపడిన సంగతి తెలిసిందే. పంజాబ్ సహా అనేక రాష్ట్రాలు విద్యుత్ సరఫరాపై ఆందోళన వ్యక్తం చేసాయి. ఇప్పటికే అనేకమార్లు కేంద్రంబొగ్గు నిల్వలపై సమీక్ష నిర్వహించింది. దేశంలో బొగ్గు కొరత లేదని, అన్ని ప్లాంట్లకు బొగ్గు వేగంగా సరఫరా అవుతోందని ప్రకటించినా..మున్ముందు ఈ సమస్య మరింత



పెరిగే ప్రమాదం లేకపోలేదు. కోల్ ఇండియా నుంచి వేగంగా బొగ్గు ఉత్పత్తి కావడమే కాకుండా వేగంగా సరఫరా కూడా చేస్తున్నా..ఈ నిల్వలు ఎంతకాలమన్నది కేంద్రం ఆలోచన చేయాలి. బొగ్గుగనులు అధికంగా ఉన్న చత్తీస్‌గడ్, జార్ఖండ్‌లో కూడా నిరంతర ఉత్పత్తి సాధ్యం కావడం లేదు. మరోవైపు థర్మల్ స్టేషన్ల కారణంగా పర్యావరణ సమస్యలు కూడా వస్తున్నాయి. నిజానికి 130 కోట్ల జనాభా ఉన్న మన దేశంలో సహజవనరులను వినియోగించుకోవాలన్న బలమైన సంకల్పం రావడం లేదు. అలాగే నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అయ్యేలా డిమాండ్‌కు తగ్గ విద్యుత్‌ను కూడా ఉత్పత్తి చేసుకోలేక పోతున్నాం. దీనిపై ఇప్పటికే ఆలస్యం అయ్యింది. థర్మల్ విద్యతు ఖర్చుతో కూడుకున్నది కూడా కావడంతో పాటు..వనరుల కొరత ఏర్పడుతోంది. ఈ క్రమంలో తక్షణం సౌర విద్యుత్‌పై దృష్టి సారించాలి. పెద్ద ఎత్తున సౌర విద్యుత్ ఉత్పత్తికి గల అవకాశాలను పరిశీలించి.. ఇందుకు ప్రైవేట్ సంస్థలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. దేశంలో బహుముఖ అనుసంధానమే లక్ష్యంగా చేపట్టిన గతిశక్తితో రాబోయే 25 ఏళ్ల భారతావనికి పునాది పడిందని ప్రధాని మోదీ చెప్పిన వేళ...సౌర విద్యుత్‌ను కూడా ఒక టాస్క్‌గా తీసుకోవాలి. 16 మంత్రిత్వ శాఖల సమన్వయంతో చేపట్టే ఈ కార్యక్రమం ద్వారా రానున్న రోజుల్లో దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాల ముఖచిత్రం సమూలంగా మారనుందని ప్రధాన తెలిపారు. రూ.100 లక్షల కోట్లతో అమలు చేసే 'పీఎం గతిశక్తి.. నేషనల్ మాస్టర్‌ప్లాన్ ఫర్ మల్టీమోడల్ కనెక్టివిటీ' కార్యక్రమానికి ప్రధాని శ్రీకారం చుట్టారు. ఇందులో సౌరవిద్యుత్ లాంటి వ్యవస్థలను కూడా తీసుకుంటే మంచిది. పీఎం గతిశక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్' 21వ శతాబ్దిలో భారతదేశానికి నూతన ఉత్తేజాన్ని అందిస్తుందని ప్రధాని మోదీ వివరించారు. ప్రగతి కోసం పని, ప్రగతి కోసం సంపద, ప్రగతి కోసం ప్రణాళిక, ప్రగతికే ప్రాధాన్యం.. ఇదే ఈనాటి మంత్రమని ఆయన విశ్వసిస్తున్న వేళ ప్రస్తుత విద్యుత్ సంక్షోభానికి శాశ్వత పరిష్కారం చూపగలగాలి. బహుళ సమస్యలను పరిష్కరించడంతోపాటు కీలక మౌలిక వసతుల ప్రాజెక్టుల భాగస్వాముల కోసం 'గతిశక్తి'ని తీసుకొచ్చామని ప్రకటించారు. దీనిద్వారా వివిధ శాఖలు, విభాగాలు ఇతర రంగాలతో సంప్రదింపుల ద్వారా తమ ప్రాజెక్టుల ప్రాధాన్యాన్ని నిర్ణయించు కోగల అవకాశం లభిస్తుంది. వివిధ మంత్రిత్వ శాఖలు తమ ప్రాజెక్టు ప్రణాళికలను రూపొందించుకోవడంలో జాతీయ బృహత్ ప్రణాళిక తోడ్పాటునిస్తుందన్నారు. 200కిపైగా అంచెలు గల విశ్లేషణాత్మక అంతరిక్ష ఉపకరణాల ఆధారిత గణాంకాలన్నింటినీ ఈ ప్రణాళిక అందుబాటులోకి తెస్తున్న వేళ విద్యుత్ ఉత్పత్తికి.. నిరంతర విద్యుత్‌కు గల అన్ని అవకాశాలను చర్చించాలి. నిపుణులతో సంప్రదిం చాలి. విద్యుత్ రంగ ప్రముఖులను పిలిచి చర్చించాలి. అప్పుడే రానున్న రోజుల్లో ఈ సంక్షోభాన్ని నివారిం చుకోగలం. అలాగే అన్ని రాష్ట్రాల్లో లభ్యత ఉన్న వనరులను పరిశీలించాలి. సౌర విద్యుత్‌కు ఉన్న అవకాశాలను పెద్ద ఎత్తున అధ్యయనం చేయాలి. దీనివల్ల అన్ని శాఖలు, విభాగాలకు అన్ని ప్రాజెక్టులపై అవగాహ న పెరుగుతుంది. తద్వారా ఆయా ప్రాజెక్టులను సకాలంలో, సమగ్రంగా పూర్తి చేసేందుకు వీలుంటుంది.ఈ దిశగా సత్వర చర్యలకు ఉపక్రమించాలి. అప్పుడే రానున్న రోజుల్లో మనకు విద్యుత్ ఉత్పత్తికి విఘాతం రాదు. ఇందుకు సత్వర కార్యాచరణ దిశగా కేంద్రం అడుగులు వేయాలి. సౌర విద్యుత్ పర్యావరణహితం కూడా కాగలదు. ఇప్పుడున్న సౌరవిద్యుత్ విధానంలో లోపాలను గుర్తించి పరిశోధనలకు పెద్దపీట వేయాలి. ఐఐటిలు, ఇతర విద్యాసంస్థలు, సౌరవిద్యుత్‌పై ప్రయోగాలను పెంచేలా చేయాలి. అలా చేసి సౌర విద్యుత్ పెంపునకు గల అవకాశాలను గుర్తించాలి. అప్పుడే దేశ విద్యుత్ అవసరాలు తీరుతాయి. ఇంధన కొరత తీరుతుంది.

# గ్రామంలో ఏ ఆపద వచ్చినా కాంగ్రెస్ పార్టీ ముందుంటుంది: కోడూరు రమేష్




**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 16 సమ సమాజం):** ఇబ్రహీంపట్నం మండలం పెత్తుల్ల గ్రామ సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు కొరిమి అంజయ్య మాతృమూర్తి అనారోగ్యంతో మృతి చెందడంతో బీద కుటుంబం కావడంతో ఆ కుటుంబానికి పెత్తుల్ల కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఆరువేల రూపాయలు ఆర్థిక సహాయం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోడూరు రమేష్ మాట్లాడుతూ, గ్రామంలో ఏ కుటుంబానికి ఆపద వచ్చిన కాంగ్రెస్ పార్టీ ముందుంటుందని, ఇప్పటికే గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేస్తున్నామని పేద కుటుంబాలకు ఇవి సమస్యలు ఉన్న కాంగ్రెస్ పార్టీ ముందు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ గ్రామ అధ్యక్షులు పంబలి జంగయ్య, దాచేపల్లి సాయి, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ధార నరసింహ, బోడ నరసింహ, మైసయ్య, కొరిమి నరసింహ, యాదయ్య,పాండు దాసు, శ్రీకాంత్, రాజు, ప్రవీణ్ వినోద్తదితరులు పాల్గొన్నారు.

# అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ఆహ్వానం లేదు

(మొదటి పేజీ తరువాయి) లోని నేషనల్ ఇన్సిస్ట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్, విజ్ఞాన భారతి ఆధ్వర్యంలో జాతీయ పాలక మండలి సభ్యులు, విజ్ఞాన భారతి, కేఎస్ శాస్త్రి రచించిన స్వతంత్ర సమరంలో విజ్ఞాన శాస్త్రం అనే పుస్తక ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా రాష్ట్ర గవర్నర్ తమిళి సై సౌందరరాజన్ తో పాటు డైరెక్టర్ హేమలత హాజరయ్యారు. బ్రిటిష్ పరిపాలన కారణంగా దాగి ఉన్న చరిత్ర ఇప్పుడు ఓ పుస్తకం రూపంగా బయటికి రావడం సంతోషంగా ఉందని గవర్నర్ తమిళి సై అన్నారు. ఇలాంటి పుస్తకాలు యంగ్ పీపుల్ కి తెలియాలన్న ఆమె.. ఆదివాసుల ఆరోగ్యం కోసం ఐసీఎంఆర్ తో కలిసి పని చేయడం సంతోషంగా ఉందని చెప్పారు. ఈ పుస్తకం తెలుగులో ఉన్న కారణంగా చదవలేకపోతున్నానన్న గవర్నర్.. ట్రాన్స్ లేట్ చేసి చదువుతానని వెల్లడించారు. ఇన్నేండ్ల స్వాతంత్రంలో ఎడ్యుకేషన్ పాలసీ కోసం ఎదురు చూశాం.. కానీ కేంద్రం దాన్ని నిజం చేస్తోందని గవర్నర్ తమిళిసై వ్యాఖ్యానించారు. గ్రహాల మధ్య సూర్యుడు ఉన్నట్లు.. కొంత మంది రాజకీయ నాయకులు వారి కొడుకులను మధ్యలో ఉంచాలని అనుకుంటారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు జైలుకెళ్ళి ఒక్కరోజులో తిరిగి వచ్చినట్టు కాదు, గతంలో చిన్న వయసులోనే జైలుకెళ్ళిన ఫ్రీడమ్ ఫైటెర్స్ కొన్ని రోజులపాటుగా జైల్లోనే ఉండి ప్రజల రక్షణ కోసం ఆలోచించారని చెప్పారు. ఈ సందర్భంగా చేనేత కలను ప్రపంచానికి తెలిసేలా అగ్గిపెట్టెలో పట్టే చీరను కళాకారులు గవర్నర్ కి బహుమతిగా ఇచ్చారు.

# పేపర్ లీకేజీ కేసులో సిట్టింగ్ జడ్జి దర్యాప్తు చెయ్యాలే !



(మొదటి పేజీ తరువాయి) చేతులు దులుపుకునేందుకే సిట్ ఏర్పాటు చేశారని ఆరోపించారు. కేసీఆర్ అవినీతిపై పోరాడుతున్నా మనే.. తమపై టెన్త్ పేపర్ లీక్ ఆరోపణ చేశారని మండిపడ్డారు. ఎక్కడ ఏం జరిగినా బండి సంజయ్ కారణమని అనడం అలవాటు చేసుకున్నారని మండిపడ్డారు. ప్రశ్నిస్తారనే పేదలను విద్యకు దూరం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా ఇవ్వని దుర్మార్గుడు కేసీఆర్ అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మళ్లీ ఆంధ్ర, తెలంగాణ సెంటిమెంట్ రగిలించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల ముందే కేసీఆర్‌కు మహనీయులు గుర్తుకొస్తారని, కేసీఆర్ తొలిసారి నిన్న అంబేద్కర్ జయంతి వేడుకలో పాల్గొన్నారని సంజయ్ విమర్శించారు. సీఎం కేసీఆర్‌కు అంబేద్కర్ విగ్రహాన్ని ముట్టుకునే అర్హత లేదని బండి సంజయ్ అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని అవమానించారని మండిపడ్డారు. ఒక్కసారి కూడా కేసీఆర్ అంబేద్కర్ వర్ధంతి, జయంతికి హాజరు కాలేదని గుర్తు చేశారు. కానీ ఎన్నికలు వస్తున్నాయనే హైదరాబాద్ లో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని విమర్శించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ యువత భవిష్యత్ ను నాశనం చేస్తున్నారని బండి సంజయ్ విమర్శించారు.30 లక్షల మంది యువత భవిష్యత్ ను పాడుచేశారని ఆరోపించారు. టీఎస్పీఎస్సీ పేపర్ లీక్ అయితే కనీసం ఒక్క మాట కూడా మాట్లాడలేదన్నారు. టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీపై సిట్ తో కాకుండా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బండారం బయటపడుతుందనే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించడం లేదని మండిపడ్డారు. టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీపై విద్యార్థులకు కేసీఆర్ క్షమాపణ చెప్పాలని..మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అన్ని పేపర్ల లీకులకూ బండి సంజయే కారణమని చెబుతున్నారని ఆయన మండిపడ్డారు. ప్రజల సమక్షంలో సమాధానం చెప్పక తప్పదని ఆయన పేర్కొన్నారు. ఇంట్లో కార్యక్రమం ఉందని చెప్పినా అరెస్ట్ చేశారని.... కేసీఆర్ ఇంట్లో వారంతా దందాలు చేస్తున్నారని ఆరోపించారు. తప్పు లేకపోయిన ఈటలను బయటకు పంపారని గుర్తు చేశారు. ఇడీ విచారణ అంటే చాలు..కేసీఆర్ అనేక సాకులు చెప్తున్నారని బండి సంజయ్ ఎద్దేవా చేశారు. 30 లక్షల మంది యువత ఇబ్బందిపడితే ప్రగతి భవన్ నుంచి బయటకు రారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు, ఇంటర్ విద్యార్థులు, ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్య చేసుకున్నా...కేసిఆర్ స్పందించరని మండిపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎన్నో బాధలుపడి హైదరాబాద్ వస్తారని..కానీ కేసీఆర్ ఉద్యోగాల పేరుతో యువతను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనివర్సిటీల్లో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. యువత చదువుకుంటే ప్రశ్నిస్తారని..ఉద్యోగాలు అడుగుతారని అందుకే వర్సిటీలను నిర్వీర్యం చేశారన్నారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం రావడం ఖాయమని బండి సంజయ్ దీమా వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన మరుక్షణమే రాష్ట్రంలో ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. ప్రతీ ఏడాది జాబ్ కాలెండర్ ను రిలీజ్ చేస్తామన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను విడుద చేస్తామన్నారు. లిక్కర్ స్కాంలో బిడ్డ దొరికితే ఆమెపై చర్యలు తీసుకోరని..పేపర్ లీకేజీలో కేటీఆర్ హస్తం ఉన్నా ఏమీ అనరన్నారు. కానీ దళిత మంత్రి రాజయ్యను మాత్రం ఏ తప్పు చేయకున్నా... మంత్రి పదవి నుంచి తీసివేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ పై బీజేపీ ఈటల రాజేందర్ మండిపడ్డారు. కేసీఆర్ కుటుంబానికే ఉద్యోగాలు వచ్చాయని, కేసీఆర్ దోచుకోవడానికే ఉన్నారు... మన కోసం లేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్, కేటీఆర్ సిగ్గుతో తలదిచుకోవాలన్నారు. తూ తూ మంత్రంగా నోటిఫికేషన్లు వేశారని విమర్శించారు. కొన్ని రోజులైతే కేసీఆర్ సర్కార్ గంగలో కలుస్తుందని విమర్శించారు. ఃాఖాల పేపర్ లీక్ బాధ్యత కేసీఆర్ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. కేసీఆర్ వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేసీఆర్ ఫీజు పీకే వరకూ ఈ ఉద్యమం ఆగదన్నారు. బీజేపీ కేసులకు భయపడదన్నారు. పోలీస్ స్టేషన్‌లలో ఎవడెవడు ఏం చేస్తున్నాడో అన్ని రికార్డులు రాస్తున్నామన్నారు. తెలంగాణలో లీకేజీలు, లిక్కర్ కేసులు ఉన్నాయని ఎంపి లక్ష్మణ్ మండిపడ్డారు. నిరుద్యోగ మార్చ్‌కు వేలాదిగా నిరుద్యోగులు తరలివచ్చారు.

# నిజామాబాద్ ఆస్పత్రిలో దారుణం

(మొదటి పేజీ తరువాయి) నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానలో రోగిని సహాయకులు కాళ్లు పట్టుకుని లాక్కెళ్లిన దృశ్యాలు వైరల్ కావడం పట్ల ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ స్పందించారు. ఆస్పత్రికి వచ్చిన రోగుల పట్ల సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వచ్చిన ఆరోపణలను ఆమె తీవ్రంగా ఖండించారు. రోగిని సహాయకులు మార్చి 31వ తేదీని ఆస్పత్రికి తీసుకొచ్చారని సూపరింటెండెంట్ తెలిపారు. లిఫ్ట్ వచ్చిందన్న తొందరలో సహాయకులే రోగి కాళ్లు పట్టుకుని లాక్కెళ్లారని పేర్కొన్నారు. అది గమనించిన సిబ్బంది వాళ్లను వారించి వీల్‌ఛైర్‌లో తీసుకెళ్లారని స్పష్టం చేశారు. వీల్‌ఛైర్ తీసుకొచ్చేలోపు లిఫ్ట్ రావడంతో రోగి తల్లిదండ్రులు అతని కాళ్లు పట్టుకుని లాక్కెళ్లారని చెప్పారు. ఇది చూసి సిబ్బంది వారించి.. వీల్‌ఛైర్‌లో తీసుకెళ్లారని స్పష్టం చేశారు. ఇదంతా తెలియక ఎవరో ఒక వ్యక్తి వీడియో తీసి సోషల్ మీడియాలో ప్రచారం చేశారని పేర్కొన్నారు. పూర్తి సమాచారం తెలియ కుండా ఇలాంటి వీడియోలు తీసి ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం పోగొట్టేలా చేయడం బాధాకరమని పేర్కొన్నారు. ఆస్పత్రిపై దుష్ప్రచారాలు చేసే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి సంబంధించి ఓ వీడియో ఘటనపై రాష్ట్ర ఆరోగ్యశాఖమంత్రి హరీశ్ రావు స్పందించారు. ఈ ఘటనపై నిజానిజాలు తెలిసేలా విచారణ జరిపి, తక్షణమే నివేదిక అందజేయాలని మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌ను ఆదేశించారు.

# మోడీకి వేయి కోట్లు ఇచ్చామంటే కేసు పెడతారా!

(మొదటి పేజీ తరువాయి) పేర్కొనడం, ఆయన అలా వ్యాఖ్యానించిన రెండ్రోజులకే మద్యం కుంభకోణం కేసులో సీబీఐ నోటీసులు ఇవ్వడం చర్చనీయాంశ మవుతోంది. కాగా, సీబీఐ సమన్లు పంపినంత మాత్రాన అవినీతిపై కేజ్రీవాల్ పోరాటం ఆపే ప్రసక్తే లేదని ఆ పార్టీ అధికార ప్రతినిధి సంజయ్ సింగ్ తెలిపారు. ఢిల్లీ మద్యం విధానం కేసులో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్‌కు సీబీఐ సమన్లను జారీ చేయడంపై సీనియర్ అడ్వకేట్, రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ తీవ్రంగా స్పందించారు. సీబీఐ గత ఏడాది ఆగస్టు 17న దాఖలు చేసిన ఎఫ్ఐఆర్ లో కేజ్రీవాల్‌ను నిందితునిగా పేర్కొనలేదు. ఈ కేసులో కొందరు సాక్షులు, నిందితులను ప్రశ్నించిన తర్వాత ఆయన పేరు వెలుగులోకి వచ్చింది. ఆయన నుంచి వివరణ కోరాలని సీబీఐ కోరుకుం టోంది. కొందరు సాక్షులు, నిందితులు ఢిల్లీ మద్యం విధానం రూపకల్పన, అమలుకు సంబంధించి చెప్పిన విషయాలపై వివరణ కోరేందుకే ఆయనను సీబీఐ పిలిచింది. ఈ నేపథ్యంలో కపిల్ సిబల్ శనివారం మాట్లాడుతూ, కేజ్రీవాల్‌పై సీబీఐ చర్యను తాను ముందుగానే ఊహించానని చెప్పారు. ఆయనకు సీబీఐ సమన్లు జారీ చేయడంపై బీజేపీని ఎండగట్టారు. ప్రతిపక్షాలు లేని భారత దేశాన్ని బీజేపీ కోరుకుంటోందని అన్నారు. ఆ పార్టీకి ఎదురు నిలిచే నేతల పరువు, ప్రతిష్ఠలను భంగపరిచేందుకు ప్రయత్నిస్తోందన్నారు. కేజ్రీవాల్ రాజకీయంగా ఎదుగుతున్నారని, అందువల్ల ఆయనను సీబీఐ పిలుస్తుందని తాను కొద్ది నెలల క్రితం ఓ వ్యాసంలో రాశానని తెలిపారు. గత ఏడాదిలో కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగపరిచారని ఆరోపించారు. రాజకీయ పార్టీలన్నీ తమ విభేదాలను పక్కనబెట్టి, ఈ అన్యాయంపై ముక్తకంఠంతో మాట్లాడాలని చెప్పారు. ఇది ప్రజాస్వామ్యాన్ని హత్య చేయడమేనని తెలిపారు. ప్రతిపక్ష పార్టీల నేతలందరిపైనా బీజేపీ దాడి చేస్తోందని ఆరోపించారు. ప్రతిపక్షాల పాలిత రాష్ట్రాలైన జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, కేరళ ముఖ్యమంత్రులను, ఇతర నేతలను ఏ విధంగా బీజేపీ లక్ష్యంగా చేసుకున్నదో మనం చూస్తూనే ఉన్నామన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలను కూల్చడం కోసం రాజ్యాంగంలోని పదో షెడ్యూలు నిబంధనలను బీజేపీ దుర్వినియోగపరుస్తోందన్నారు. ప్రతిపక్ష పార్టీల నేతల పరువును మంటగలిపేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని, సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలను దుర్వినియోగపరుస్తోందని ఆరోపించారు. కపిల్ సిబల్ ఇచ్చిన ట్వీట్‌లో, కేజ్రీవాల్‌కు సీబీఐ సమన్లను జారీ చేసిందని, చట్టం తన పని తాను చేసుకు పోతుందని బీజేపీ అంటుందని, అయితే అణచివేత తన పని తాను చేస్తోందనేది తన అభిప్రాయమని చెప్పారు. ఢిల్లీ మద్యం విధానం కేసులో రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ.2,600 కోట్ల మేరకు నష్టం వాటిల్లిందని సీబీఐ ఆరోపించింది. రూ.100 కోట్ల మేరకు ముడుపులు చేతులు మారినట్లు ఆరోపించింది. ఈ కేసులో ఇప్పటికే సుమారు 11 మంది అరెస్టయి, జైలులో ఉన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ నేత, ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా కూడా అరెస్టయి, జైలులో ఉన్నారు. తెలంగాణ ఎమ్మెల్సీ కవితను కూడా ఓ దర్యాప్తు సంస్థ ప్రశ్నించింది.

# నిజామాబాద్ ఘతన ప్రభుత్వ వైఫల్యమే

(మొదటి పేజీ తరువాయి) నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో.. స్ట్రెచర్, వీల్ చైర్లు లేకపోవటంతో పేషెంట్ ను కాళ్లతో లాక్కుని తీసుకెళుతున్న వీడియోపై వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల స్పందించారు. తెలంగాణ రాష్ట్రంలో వైద్యరంగం దుస్థితికి ఇదే నిదర్శనం అన్నారు. ఈ మేరకు ట్వీట్ చేశారు. దొరగారూ అంటూ సీఎం కేసీఆర్ ను ప్రస్తావిస్తూ.. ఇదేనా ఆరోగ్య తెలంగాణ అని ప్రశ్నించారు. రోగులను నేలపై లాక్కుని పోవడం కార్పొరేట్ వైద్యమా.. స్ట్రెచర్లు, వీల్ చైర్లు లేకపోవడమే వసతుల కల్పనా అని నిలదీశారు షర్మిల. ప్రతి సంవత్సరం 11 వేల కోట్ల బడ్జెట్ అంటూనే.. రోగికి వీల్ చైర్ కూడా అందించలేని దరిద్రపు పాలన కొనసాగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారామె. ఇది మీరు చెబుతున్న ఆరోగ్య తెలంగాణ కాదు.. ప్రజలు చూస్తున్న అనారోగ్య తెలంగాణ అంటూ మండిపడ్డారు. నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో.. ట్రీట్ మెంట్ కోసం వచ్చిన యువకుడుని.. ఆస్పత్రిలోకి తీసుకెళ్లటానికి ఎలాంటి సదుపాయాలు లేకపోవటంతో.. అతన్ని ఎత్తుకుని తీసుకెళ్లలేని పరిస్థితుల్లో.. రోగిని కాళ్లు పట్టుకుని ఈడ్చుకెళ్లారు తల్లిదండ్రులు. తెలంగాణలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వసతులకు ఈ వీడియో అద్దం పడుతుందన్నారు వైఎస్ షర్మిల.




# ఐపిఎల్ తరహా లీగ్ ఏర్పాటు

## సంపన్నమైన క్రికెట్ కోసం సౌదీ యోచన





**న్యూఢిల్లీ,ఏప్రిల్15(సమసమాజం):** ఇండియన్ ప్రీమియర్ లీగ్ లాంటిదే తమ దేశంలోనూ ఏర్పాటు చేయాలని యోచిస్తున్న సౌదీ అరేబియా ఐపీఎల్ యజమానులను సంప్రదిస్తోందన్న వార్తలపై బీసీసీఐ స్పందించింది. 'ప్రపంచంలోనే అత్యంత సంపన్న టీ20 లీగ్' ను ఏర్పాటు చేసేందుకు సౌదీ రెడీ అవుతోందని, అదే జరిగితే ఐపీఎల్‌కు పోటీ తప్పదంటూ వార్తలు వచ్చాయి. ఈ వార్తలపై తాజాగా బీసీసీఐ స్పందించినట్టు తెలుస్తోంది. ఇలాంటి లీగుల్లో ఆడేందుకు టాప్ ఇండియన్ క్రికెటర్లను అనుమతించబోమని తేల్చి చెప్పినట్టు సమచారం. ఇప్పటికే ఇలాంటి విధానం కొనసాగుతోంది. విదేశీ లీగుల్లో ఇండియన్ క్రికెటర్లు ఆడకుండా బీసీసీఐ నిషేధం విధించింది. అయితే, సౌదీ ప్రభుత్వం కనుక కొత్త టీ20 లీగ్ ఏర్పాటు చేస్తే బీసీసీఐ విధానంలో కొంత మార్పు వచ్చే అవకాశం ఉందన్న వార్తలు కూడా వచ్చాయి. ప్రపంచంలోనే అత్యంత సంపన్న టీ20 లీగ్ ఏర్పాటు కోసం సౌదీ అరేబియా ఏడాది కాలంగా చర్చలు జరుపుతున్నట్టు 'ది ఏజ్' పేర్కొంది. సౌదీ అరేబియా చేస్తున్న ఈ ప్రయత్నాలు పట్టాలెక్కాలంటే తొలుత ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ అనుమతి తప్పనిసరి. కాగా, క్రికెట్‌పై సౌదీ అరేబియా ఆసక్తిగా ఉన్నట్టు ఇటీవలే ఐసీసీ చైర్మన్ గ్రెగ్ బర్కలీ పేర్కొనడం గమనార్హం. ఇతర లీగుల్లో టాప్ ఇండియన్ ప్లేయర్లు ఆడేందుకు అనుమతి ఇవ్వబోమన్న బీసీసీఐ.. ఫ్రాంచైజీ భాగస్వామ్యాన్ని మాత్రం ఆపలేమని బీసీసీఐ అన్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం భారత్‌కు ఆడుతున్న ఏ ఆటగాడినీ ఇతర లీగుల్లో ఆడేందుకు అనుమతివ్వబోమని బీసీసీఐ అధికారిని ఉటంకిస్తూ 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పేర్కొంది. అయితే, ఫ్రాంచైజీలను మాత్రం తాము ఆపలేమని ఆయన పేర్కొనట్టు తెలిపింది. అది వారి వ్యక్తిగత నిర్ణయానికే వదిలేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఐపీఎల్ ఫ్రాంచైజీలు దక్షిణాఫ్రికా, దుబాయ్ వెళ్లడాన్ని మనం చూశామని, కానీ వారికి తాము 'నో' చెప్పలేదని అన్నారు. ప్రపంచంలో ఏ లీగులోనైనా తమ జట్టు ఉండాలనుకోవడం వారిష్టమని అన్నారు.

# ఢిల్లీకి వరుస ఓటములు

## ఐదో ఓటమిని మూటగట్టుకున్న వార్నర్ సేన

## ఆర్‌సిబి సొంత గ్రౌండ్‌లో 23 పరుగులతో ఢిల్లీ చిత్తు




**బెంగళూరు,ఏప్రిల్15(సమసమాజం):** రాయల్ చాలెంజర్స్ బెంగళూరు వరుస ఓటములకు గుడ్ బై చెప్పింది. ఢిల్లీ ఐదో ఓటమిని మూటగట్టుకుంది. ఆర్‌సిబి సొంత గ్రౌండ్‌లో ఢిల్లీని 23 పరుగులతో చిత్తు చేసింది. ఆర్సీబీ పేసర్లు చెలరేగడంతో ఢిల్లీ బ్యాటర్లు చేతులెత్తేశారు. ఏకంగా ముగ్గురు డకౌట్ కావడంతో ఢిల్లీ కోలుకోలేకపోయింది.చిన్న స్వామి స్టేడియంలో ఆతిథ్య బెంగళూరు సత్తా చాటింది. బ్యాటింగ్, బౌలింగ్ లో చెలరేగి ఢిల్లీ క్యాపిటల్స్‌ను 23 పరుగుల తేడాతో మట్టి కరిపించింది. టాస్ ఓడి బ్యాటింగ్ కు దిగిన బెంగళూరు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 174 పరుగులు చేసింది. 175 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ.. తొలి దశలోనే కోలుకోలేని దెబ్బతగిలింది. పవర్ ప్లేలోనే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. మనీష్ పాండే(50) ఒంటరి పోరాటం చేశాడు. చివర్లో అమన్ ఖాన్(18) ధాటిగా ఆడినా ఫలితం లేకపోయింది. ఆరంగేట్రం మ్యాచ్‌లోనే ఆర్సీబీ పేసర్ విజయ్‌కుమార్ మూడు వికెట్లతో సత్తా చాటాడు. సొంత మైదానంలో డూప్లెసిస్ సేన రెచ్చిపోయింది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో రెండో విజయం నమోదు చేసింది. విరాట్ కోహ్లీ అర్ధ శతకం బాదడంతో 174 రన్స్ చేసింది. ఆ తర్వాత బౌలర్లు చెలరేగడంతో ఢిల్లీని 151 రన్స్‌కే పరిమితం చేసింది. ఢిల్లీ బ్యాటర్లలో మనీష్ పాండే(50) ఒక్కడే రాణించాడు. ఆర్సీబీ బౌలర్లలో విజయ్ కుమార్ మూడు, సిరాజ్ రెండు వికెట్లు తీశారు. హర్షల్ పటేల్, పార్నెల్‌కు ఒక్కో వికెట్ దక్కింది. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీకి రెండో ఓవర్‌లోనే పెద్ద షాక్ తగిలింది. ప్రధాన బ్యాటర్లు ముగ్గురికి ముగ్గురు డకౌటయ్యారు. పృథ్వీ షా(0), మిచెల్ మార్ష్(0) యశ్ ధూల్(0) ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరారు. కెప్టెన్ డేవిడ్ వార్నర్(19)ను విజయ్‌కుమార్ ఔట్ చేశాడు. దాంతో, 30 పరుగులకే నాలుగు వికెట్లు పడ్డాయి. మనీశ్ పాండే(50) ఒంటరి పోరాటం చేశాడు, అభిషేక్ పొరెల్(5), అక్షర్ పటేల్(21)తో కలిసి 40 రన్స్ జోడించాడు.

## కోహ్లీకి అసలైన వారసుడు శుభ్‌మన్ గిల్

### పాక్ క్రికెటర్ రమీజ్ రాజా అంచాన




**న్యూఢిల్లీ,ఏప్రిల్15(సమసమాజం):** టీమిండియా మాజీ సారథి విరాట్ కోహ్లీ ప్రపంచంలోని అత్యుత్తమ క్రికెటర్లలో ఒకడు. మరి అతడి తర్వాత ఎవరన్న ప్రశ్నకు పాకిస్థాన్ మాజీ క్రికెటర్ రమీజ్ రాజా సూటిగా సమాధానం చెప్పాడు. ఆ ఆటగాడు మరెవరో కాదు. శుభమన్ గిల్. దాదాపు ప్రతి ఫార్మాట్‌లోనూ సెంచరీ సాధించిన గిల్.. ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 49 బంతుల్లో ఏడు ఫోర్లు, సిక్సర్‌తో 67 పరుగులు సాధించాడు.







## కాంతారను వదలని వరాహరూపం

### బ్రిడ్జి మ్యూజిక్ ఆరోపణలతో పాటపై నిషేధం

ప్యాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకాదరణ పొందిన కన్నడ చిత్రం 'కాంతార' వివాదం మళ్లీ తెరపైకి వచ్చింది. ఉత్తర కర్ణాటక గిరిజన సంప్రదాయం ఆధారంగా రిషబ్‌శెట్టి నటించి, దర్శకత్వం వహించిన ఈ చిత్రం చిన్న సినిమాల్లో సంచలనంగా నిలిచింది. అంతా బాగానే నడిచినా ఇందులో 'వరహా రూపం' మాత్రం వివాదంలో చిక్కుకుంది. కేరళ హై కోర్టు ఈ చిత్రానికి మరో షాక్ ఇచ్చింది. ఆ సినిమాలో వరాహ రూపం సాంగ్‌ను కాపీ కొట్టారంటూ తాయికూడం బ్రిడ్జ్ మ్యూజిక్ బ్యాండ్ ఆరోపణలు చేస్తూ కోర్టు కెక్కింది. ఆ కేసు విచారణ చేపట్టిన కేరళ కోర్టు.. బ్రిడ్జ్ మ్యూజిక్ బ్యాండ్ ఆరోపణలు కొట్టిపారేసింది. ఈ పాట విషయంలో చిత్ర బృందం ప్రాథమిక కాపీ రైట్స్ చట్టాన్ని ఉల్లంఘించిందని, అందువలనే ఆ పాటపై నిషేదం కోర్టు తీర్పునిచ్చింది. ఈ కేసుకి సంబంధిం చిన ఆధారాలను మే 4లోపు ఆధారాలను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించింది.



## సోనాల్ చౌహాన్ అందాల ఆరబోత

నటిగా మోడల్‌గా గాయకురాలిగా తనకంటూ ప్రత్యేక గుర్తిం పు తెచ్చుకున్న సోనాల్ చౌహాన్ గురించి అందరికీ తెలుసు. కేవలం సినిమాల్లోనే కాకుండా సోషల్ మీడియా ద్వారా కూడా అభిమానులకు టచ్ లో ఉంటుంది. ఎప్పటికప్పుడు తన పర్సనల్ లైఫ్ తో పాటు ప్రొఫెషనల్ లైఫ్ కు సంబంధించిన విషయాలను అభిమానులతో పంచుకుంటుంది. అయితే తాజాగా ఈ హాట్ బ్యూటీ ఇన్ స్టా వేధికగా ఓ ఫొటోను షేర్ చేసింది. అందులో బికినీ వేసుకొని సోనాల్ చౌహాన్ రచ్చ చేసింది. థైస్ అందాలను చూపిస్తూ.. కుర్రకారు గుండెల్లో హీటు పుట్టిస్తోంది. అసలే వేసవి కాలం ఆ వేడిని తట్టుకోలేక విపరీతంగా చెమటలు కార్చు కుంటుంటే.. ఆమె హాట్ ఫొటోలు చూపిస్తూ మరింత హీటెక్కిస్తుంది. కూలింగ్ గ్లాసెస్ పెట్టుకొని పింక్ కలర్ బ్రా.. పైన బేబీ పింక్ కోట్ వేసుకుంది. క్లీవేజ్ షోతో పాటు ఎద అందాలు కనిపించేలా ఫొటో దిగింది. ఈ ఫొటోను నెట్టింటి పోస్ట్ చేసి సోషల్ మీడియాను ఓ ఊపు ఊపేస్తుంది. సోనాల్ చౌహాన్ పోస్టు చేసిన ఈ ఫొటో చూసిన నెటిజెన్లు పెద్ద ఎత్తున కామెంట్లు చేస్తున్నారు. నీ అందాలను తట్టుకోలేకపోతున్నాం చెమటతోనే తడిసి ముద్దయిపోతున్నాం అంటూ చెబుతున్నారు. బికినీలో అదిరిపోయావని కొందరు.. ఆ కోట్ కూడా తీసేసి ఫొటోలు దిగితే బాగుండని మరికొందరు అంటున్నారు. జన్నత్ సినిమాతో సినీ రంగంలో అడుగు పెట్టి ఆ ఢిల్లీ భామ.. లెజెండ్ సినిమాతో టాలీవుడ్ లో అడుగు పెట్టింది. ఆ తర్వాత పండగ చేస్కో షేర్ సైజ్ జీరో డిక్టేటర్ రూలర్ ది ఘోస్ట్ చిత్రాల్లో కూడా నటించి మెప్పించింది. ఈ తర్వాత విక్టరీ వెంకటేష్ వరుణ్ తేజ్ కాంబోలో వచ్చిన ఎఫ్3 సినిమాలోనూ సందడి చేసింది. ఎఫ్3 సినిమా సక్సెస్ అవ్వడం.. అందులోనూ చౌహాన్ పాత్రకు మంచి మార్కులు పడడంతో మరో సినిమా కోసం వేచి చూస్తోంది. ఈ అమ్మడుకు అంతగా ఆఫర్లు రాకపోవడంతో సోషల్ మీడియాను అడ్డాగా మార్చుకున్నట్లు కనిపిస్తోంది. గ్లామర్ డోస్ ను విపరీతంగా పెంచి కుర్రకారుకు నిద్ర లేకుండా చేస్తోంది. ఎప్పటికప్పుడు తన గ్లామరస్ ఫొటోలను షేర్ చేస్తూ తన ఉనికిని చాటుకుంటోంది.

## ఐఎంబిడి సెలబ్రిటీల జాబితా

### మూడో స్థానం దక్కించుకున్న రష్మిక



సినిమాలకు ,సెలబ్రెటీలకు రేటింగ్ ఇస్తూ ఎంతో ప్రాచుర్యం దక్కించుకున్న ఆన్ లైన్ పోర్టల్ ఐఎంబిడి తాజాగా ప్రముఖ భారతీయ సెలబ్రిటీల జాబితా ను విడుదల చేసింది. ఆ జాబితాలో హీరోయిన్ రష్మిక మందన్న మూడవ స్థానంలో నిలిచింది. నేషనల్ క్రష్ గా గుర్తింపు దక్కించుకున్న రష్మిక మందన్నా మరోసారి జాతీయ స్థాయిలో టాప్ సెలబ్రిటీల జాబితాలో చోటు దక్కించుకుంది. ఇటీవల పుష్ప 2 టీజర్ వచ్చిన సందర్భంగా మరియు ఆమె పుట్టిన రోజు సందర్భంగా సోషల్ మీడియాలో రష్మిక మందన్న పేరు ప్రముఖంగా చర్చ జరిగింది.



## సినిమాలు పూర్తి చేసే పనిలో పవన్ కళ్యాణ్

### సాయిధరమ్ సినిమాలో షూటింగ్ పార్ట్ పూర్తి

పవన్ కళ్యాణ్ చేతి నిండా చాలా సినిమాలు వున్నాయి. అటు రాజకీయంగా కూడా చాలా బిజీ గా ఉంటాడు, అందుకని ఒప్పుకున్న సినిమాలకి తగు న్యాయం చెయ్యాలని చూస్తున్నాడు పవన్ కళ్యాణ్. అందుకే ఇప్పుడు పూర్తిగా సినిమాల మీదే దృష్టి పెట్టినట్టున్నాడు. ఆమధ్య సముద్రఖని దర్శకత్వంలో తన మేనల్లుడు సాయి ధరమ్ తేజ్‌తో చేస్తున్న సినిమాలో పవన్ కళ్యాణ్ తన పాత్ర షూటింగ్ పూర్తి చేసాడు. ఆ సినిమాకి పవన్ కళ్యాణ్ బాలన్స్ ఏమి లేదు. వాళ్ళకి కూడా రానున్న రోజుల్లో కొన్ని డేట్స్ కేటాయించి ఆ సినిమాని కూడా పూర్తి చేయాలనే యోచనలో పవన్ కళ్యాణ్ ఉన్నాడని తెలిసింది. రాజకీయంగా తను బిజీ అయ్యే సమయానికి ఈ సినిమాలనే ఒకటొక్కటి పూర్తి చేసి, ఎలెక్షన్ వచ్చే సమయానికి కొన్ని సినిమాలు విడుదల అయ్యేట్టు చూసుకుంటున్నట్టుగా భోగట్టా. ఇవే కాకుండా ఇంకా కొన్ని లైన్ అప్ లో ఉన్నాయని కూడా తెలుస్తోంది.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in